ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల

జిల్లా వార్తలు

5

శుక్రవారం 8 నవంబరు 2024

మా స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయండి

కలెక్టర్‌కు చిన్నగుడిపేట విద్యార్థుల లేఖ



కలెక్టర్‌కు రాసిన ఉత్తరాన్ని చూపుతున్న విద్యార్థులు

భీమిని, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్నగడిపేట ప్రాథమిక పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థులు కలెక్టర్‌కు గురువారం లేఖ రాశారు. స్థానికంగా 8వ తరగతి వరకు మాత్రమే ఉండటంతో 9, 10 తరగతులు చదివేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. హైస్కూల్ విద్య కోసం పది కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించాల్సి వస్తోందన్నారు. చార్జీల భారం భరించలేక తల్లిదండ్రులు బడి మాన్పించి పొలం పనులకు తీసుకెళ్తున్నారని విద్యార్థులు చెప్పారు. పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తే ఉన్నత చదువులు చదివి ప్రయోజకులమవుతామని లేఖలో విద్యార్థులు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

ఎన్యూమరేటర్లకు శిక్షణ



ఎన్యూమరేటర్లకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో

వేమనపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనే ఎన్యూమరేటర్లకు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్‌ల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో గురువారం శిక్షణ ఇచ్చారు. సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలను నమోదు చేయాలని సూచించారు. పర్యవేక్షణ అధికారి ఇష్తేకర్, ఏపీవోసత్యప్రసాద్, పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ అన్నారు. ముత్యంపల్లి రైతువేదికలో ఎన్యూమరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఏమైన ఇబ్బందులుంటే అధికారులను సంప్రదించాలన్నారు. తహసీల్దార్ భోజన్న, ఎంపీవో సప్దర్ అలీ, వ్యవసాయాధికారి ప్రభాకర్, ఏఎస్‌వో అమరేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): విద్యావనరుల కేంద్రంలో సర్వే సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఎంఈవో సురేష్ మాట్లాడుతూ సున్నితంగా మాట్లాడి కుటుంబ యజమానుల నుంచి వివరాలు పొందాలని సూచించారు. ఎంపీడీవో మధుసూదన్, తహసీల్దార్ సదానందం, ఎంపీవో సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాపం శునకాలు



అండాళమ్మ కాలనీలోని ఆసుపత్రి భవనం

- కు.ని. ఆపరేషన్ కోసం ఆస్పత్రికి
- వేతనాలు ఇవ్వాల్సి వస్తుందని సిబ్బంది తొలగింపు
- పది రోజులుగా ఆహార పానియాలకూ దూరం
- ఆలనాపాలనా చూసేవారు లేక మృత్యువాత
- జిల్లా కేంద్రంలో వెలుగు చూసిన ఘటన

మంచిర్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయడం ద్వారా వాటి వ్యాప్తిని నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని అండాళమ్మ కాలనీ సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పశు సంరక్షణ కేంద్రం పేరుతో ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. ఇందులో డాక్టర్ గది, ఆపరేషన్ థియేటర్‌తోపాటు శునకాలను ఉంచేందుకు రెండు గదులను నిర్మించారు. నిర్వహణ బాధ్యతలను హైదరాబాద్‌లోని ఎనిమిల్ వెల్ఫేర్ సొసైటీ దక్కించుకుంది. ఆస్పత్రిలో ప్రస్తుతం ఒక వెటర్నరీ డాక్టర్‌తోపాటు ఇద్దరు వెటర్నరీ అసిస్టెంట్లు, ఒక వాచ్‌మన్, శునకాలకు ఆహారం వండి పెట్టేందుకు కుక్, హెల్పర్‌ను ఏజెన్సీ నియమించింది. ఆస్పత్రి భవనం పూర్తికావడంతో ఈ ఏడాది మార్చి 13న ప్రారంభించారు. అనంతరం ఏప్రిల్ నుంచి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి వీధి కుక్కలను తీసుకొస్తున్నారు. శునకాలను పట్టి తెచ్చేందుకు (డాగ్ క్యాచర్లు) ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను నియమించారు. శస్త్ర చికిత్స అనంతరం వారం రోజులపాటు వాటిని అబ్జర్వేషన్‌లో ఉంచి, తరువాత ఎక్కడి నుంచి తెచ్చారో అక్కడే వదిలి పెడతారు.

రెండు నెలలుగా వేతనాలు బంద్..

ఆస్పత్రిలో సిబ్బందికి ఏజెన్సీ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. డాక్టర్‌కు నెలకు రూ. 35వేలు, వాచ్‌మన్, కుక్, హెల్పర్ ఒకొక్కక్కరికి రూ.12వేలు, వెటర్నరీ అసిస్టెంట్‌కు రూ.16వేల చొప్పున వేతనాలు చెల్లించేందుకు ఏజెన్సీ అంగీకరించింది. ఐదు నెలలపాటు ఆగస్టు వరకు సక్రమంగా వేతనాలు చెల్లించినప్పటికీ సెప్టెంబరు, అక్టోబరు మాసాలకు సంబంధించి రెండు నెలల వేతనాలు పెండింగులో ఉన్నాయి. దీంతో వేతనాల కోసం సిబ్బంది ఏజెన్సీపై ఒత్తిడి తేవడంతో డాక్టరు మినహా 10 రోజుల క్రితం మిగతా సిబ్బందిని మూకుమ్మడిగా విధుల్లో నుంచి తొలగించింది.

మిగతా 7వ పేజీలో..



ఆపరేషన్ గది వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఎత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

తాండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపల్లెవాడలోని శ్రీరామ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా నిర్వహించే పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే పత్తిలో 12 శాతం తేమ తక్కువగా ఉండేలా చూసుకోవాలని, చెత్తచెదారం లేని నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు దళారులకు పత్తి విక్రయించి మోసపోవద్దన్నారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. క్వింటాల్ పత్తి ధర రూ.7521 ఉందన్నారు. 12 శాతం కన్నా ఎక్కువ తేమ శాతం ఉన్న పత్తిని కొనుగోలు చేయరని, 8 నుంచి 12 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి షాబుద్దీన్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఇద్దరు యువ పత్తి రైతులు ప్రసాద్, రాములును సన్మానించారు. కార్యదర్శి భాస్కర్, డీవో రాజశేఖర్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏసీపీ రవికుమార్, సీఐ కుమారస్వామి, ఎస్‌ఐలు సౌజన్య, కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గట్టు మురళీధర్‌రావు, రవీందర్‌రెడ్డి, ఎండీ ఈసా, సిరంగి శంకర్, సాలిగాం బానయ్య, పోచం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పంటలకు సీసీ కెమెరాలు

చోరీల భయంతో రైతుల జాగ్రత్తలు

తోటల రక్షణకు రైతుల ప్రయత్నం

తోటలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

7

సమస్యల వలయంలో మైనార్టీ గురుకులం

- గురుకులం పక్కనే డంపుయార్డు
- గదుల్లోకి భరించలేని దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



మైనార్టీ రెసిడెన్షియల్ భవనం పక్కనే ఉన్న డంప్‌యార్డు చెత్త

6

సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రూ. 10,40,500 విలువ గల 50 సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పథకం వల్ల పేదలకు ఎంతో ఆర్థిక మేలు జరుగుతుందన్నారు. అనంతరం 13 దండారీలకు రూ. 1.95 లక్షల విలువగల చెక్కుల ను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజన సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దండారీ ఉత్సవాలకు రూ.1.50 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ నాయకు లు రాజశేఖర్, ఇసాక్, ఇందయ్య, రమేష్, రాజన్న యాదవ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయంలో పూజలు



ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, బస్తీ వాసులు

బెల్లంపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీలోని దుర్గామాత ఆలయంలో గురువారం ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్‌లు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించిన పనులు పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు, బస్తీ ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానించారు. దేవాలయం అభివృద్ధికి ఎల్లవేళలా ముందుంటామని ఎంపీ, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తాండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ విద్యార్థులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాల అమలు సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ సమీకృత పథకాల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని దిశ చైర్మన్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, డీఆర్‌డీవో కిషన్‌లతో కలిసి దిశ (డిస్ట్రిక్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) జిల్లా అభివృద్ధి సమన్వయ పరిరక్షణ కమిటీ త్రైమాసిక సమావేశానికి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ జాతీయ రహదారి 163లో భాగంగా ప్యాకేజీ 1లో 83 శాతంతో 31.4 కిలోమీటర్లు, ప్యాకేజీలో 2లో 9.8 కిలోమీటర్లు మొత్తం 164 ఎకరాల సేకరణ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఎన్‌హెచ్ 363లో 42 కిలోమీటర్ల మంచిర్యాలలో జిల్లాలో పూర్తయి మెయిటెన్స్‌లో ఉందని, ఎన్‌హెచ్ 63లో భాగంగా 4వ దశలో 35 కిలోమీటర్లకు లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. బొక్కల గుట్ట నుంచి మంచిర్యాల వరకు ఉన్న రోడ్డును మార్చి లోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 3 బస్తీ దవాఖానాలు, వంద పల్లె దవాఖానాలు, 149 ఆరోగ్య ఉపకేంద్రాలు, 651 ఆశా కార్యకర్తల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్నామన్నారు. నేషనల్ హెల్త్‌మిషన్ కింద సబ్ సెంటర్లు అలోకేషన్‌కు రూ. 11 కోట్లు అవసరం ఉందని తెలిపారు. అభ్యర్థుల అవసరాలకు అనుగుణంగా సదరం శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నామన్నారు. ఆరు అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదనలు పంపగా 2 పూర్తయ్యాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ఈ సీజన్‌లో 326 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 2024-25లో ఇప్పటి వరకు 93,932 మంది కూలీలకు పనులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఇందిర మహిళ శక్తిలో భాగంగా కిరాణం, సైకిల్ షాప్, మీసేవ, క్యాంటీన్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో భాగంగా రెండు విడతల్లో 2,216 రెండు పడక గదుల ఇండ్లను మంజూరు, ఇందులో 1,206 పూర్తి కాగా 96 ఇండ్లు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ బానోత్ ప్రసాద్

మందమర్రిరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ సూచించారు. గురువారం సారంగపల్లిలో రైతులకు వరి పంటపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ హార్వెస్టర్ యంత్రంలో ఫ్యాన్ వేగంగా 18 ఆర్‌పీఎం ఉండేలా చూసుకోవాలని, అప్పుడే తాలు, తప్పలేని ధాన్యాన్ని రైతులు పొందుతారన్నారు. వరి ఎండినప్పుడే వరి కోతలు చేపట్టాలని సూచించారు. 14 నుంచి 17 శాతం మించకుండా తేమశాతం చూసుకోవాలని సూచించారు. పత్తి లో 8 నుంచి 12 శాతం తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. తేమ శాతం తక్కువగా ఉంటే రైతులకు మద్దతు ధర ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఏఈవో ముత్యం తిరుపతి, శ్రీరామ సీడ్స్ అధికారి మహేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

కన్నెపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివిధ ధ్రువపత్రాలకు అందిన దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సర్టిఫికెట్లను త్వరగా జారీ చేయాలని సూచించారు. ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి సూచనలు చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని, అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. మండల ప్రజా పరిషత్, పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం అశోక్, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఎరుకల కులస్తులు వివరాలు నమోదు చేసుకోవాలి

నెన్నెల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కులగణనలో ఎరుకల కులస్తులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు కోరారు. ఆయన గురువారం నెన్నెలలో విలేకరులతో మాట్లాడారు. ఎరుకల కులస్తుల వివరాలు ప్రభుత్వం వద్ద లేకపోవడంతో వారు పూర్తిస్థాయి రిజర్వేషన్ ఫలాలు పొందడం లేదన్నారు. ఎస్టీల్లో లంబాడాలు మాత్రమే లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉంటేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కులగణన సమయంలో గ్రామ కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రానికి అనుమతి ఇవ్వాలి

దండేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముత్యంపేట శివారులో ధాన్యం ఆరబెట్టేందుకు, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు ముత్తె వెంకటేష్, బీజేపీ నాయకుడు కొండ నరేష్‌లు తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రాన్ని అందించారు. ముత్యంపేట శివారులోని 17 సర్వే నెంబర్ 34 గుంటల ప్రభుత్వ భూమిలో అక్రమంగా కందిపంట సాగు చేస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకవచ్చారు. గతంలో ఈ స్థలంలో పంటను ఆరబెట్టి విక్రయించే వారన్నారు. అక్రమంగా సాగు చేసిన కంది పంటను తొలగించి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

బెల్లంపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌టీయూసీ కార్యాలయంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు మణిరాంసింగ్, ఏడుకొండలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని తెలిపారు. దామోదర్‌రెడ్డి, మల్లయ్య, రాయలింగు, రమేష్, సత్యనారాయణ, తిరుపతి, రాములు, పోశం, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రాళ్లవాగు వంతెన



కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

కాసిపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మామిడిగూడెం-మందమర్రి మధ్యలో ఉన్న రాళ్లవాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో మామిడిగూడెం, పెద్ద ధర్మారం ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మామిడిగూడెం-మందమర్రి మధ్యలోని రాళ్లవాగుపై సింగరేణి యాజమాన్యం గతేడాది తాత్కాలిక వంతెన నిర్మాణం చేపట్టింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ మామిడిగూడెంకు రావాలంటే పది కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుంది. వ్యాధుల బారిన పడిన వారిని బైక్‌లపై వాగు దాటించాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణి ఖని మెగా ఓసీపీ నిర్మాణ దశలో ఉన్నప్పుడు సింగరేణి యాజమాన్యం గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చింది. సింగరేణి అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

తాత్కాలిక వంతెనను పునరుద్ధరించాలి

- సంపత్, మామిడిగూడెం మాజీ సర్పంచు

వర్షాలకు తెగిపోయిన మందమర్రి-మామిడిగూడెం మధ్యలోని వాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. వంతెనను పునరుద్ధరించాలి. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే వాగు దాటాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు రావడం లేదు. మందమర్రి జీఎంకు వినతి పత్రం ఇచ్చినా స్పందించడం లేదు.

డీఎస్పీల బదిలీ

కరీంనగర్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని పలువురు డీఎస్పీల బదిలీలు జరిగాయి. ఈమేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీఅయ్యాయి. కరీంనగర్ పీటీసీలో పనిచేస్తున్న బి రామానుజంను ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డీఎస్పీగా బదిలీ చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆసిఫాబాద్ డీఎస్పీగా, ఆసిఫాబాద్ డీఎస్పీ పి సదయ్యను హైదరాబాద్ చీఫ్ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిర్మల్ డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న పి రవీందర్‌రెడ్డి ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేశారు.

సీఎం బర్త్‌డే వేడుకలను ఘనంగా జరపాలి

● ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఉన్నందున సిర్పూరు నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో, గ్రామగ్రామన వేడుకలు ఘనంగా జరపాలని ఎమ్మెల్సీ దండే విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి దేవాలయాల్లో, ప్రార్థన మందిరాల్లో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పండ్లను పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కోరారు.

సమస్యల వలయంలో..

మైనార్టీ గురుకులం

● గురుకులం పక్కనే డంపుయార్డు ● గదుల్లోకి భరించలేని దుర్వాసన

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



మైనార్టీ రెసిడెన్షియల్ భవనం పక్కనే ఉన్న డంప్‌యార్డు చెత్త

కాగజ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ విద్యాలయాలను బలోపేతం చేసేందుకు పక్కాభవనాలను నిర్మించి అన్ని వసతులు కల్పించింది. కాగజ్‌నగర్ మండలం బలగల వద్ద రూ.18కోట్లతో భవనం నిర్మించారు. అయితే భవనం పక్కనే ఉన్న డంప్ యార్డు ఉంది. ఈ డంప్ యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గన్నారంలోని తాత్కాలిక భవనంలో కొనసాగిన మైనార్టీ బాలుర-1 రెసిడెన్షియల్‌లో చదువుతున్న విద్యార్థులందరిని ఈ నూతన భవనంలోకి తరలించి విద్యను అందిస్తున్నారు.

ప్రస్తుతం 600 మంది విద్యార్థులు 5 నుంచి 12తరగతుల వరకు విద్యను అభ్యసిస్తున్నారు. భవనం పక్కనే డంప్ యార్డు ఉండటంతో భరించ లేనివాసన, పొగ వస్తుండటం విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో సేకరించిన చెత్తను ఈ డంప్ యార్డులోనే వేస్తున్నారు. రోజుల కొద్ది చెత్త పేరుకపోవటంతో ఈ ప్రాంత అంతా కూడా దుర్గంధంతో, దోమలు, ఈగలకు నిలయమంగా మారింది. డంప్‌యార్డు తొలగించి పూర్తిగా చెత్తలేకుండా చేస్తే తప్పా సమస్య తీరదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ కూడా ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.



మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రధాన ద్వారం

అంతేగాక మైనార్టీ రెసిడెన్షియల్ భవనానికి వెళ్లేందుకు పక్కా రోడ్డు లేదు. ప్రస్తుతం తాత్కాలికరోడ్డు చిన్నపాటి వర్షానికే గుంతల మయంగా మారుతోంది. చిన్నపాటి వర్షం కురిసిందంటే ఈ మార్గం గుండా వెళ్లడానికి కాలినడకే శరణ్యం. తల్లిదండ్రులు పిల్లలను చూసేందుకు వాహనాలతో వెళ్లితే తరుచూ బురదలో బైక్‌లు అదుపుతప్పి కిందపడి గాయాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కొత్త భవనమే కానీ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అసలు రంగు బయటపడింది. భవనంలో గదులు ఊరుస్తున్నాయి. అలాగే ఒక గది ఏకంగా పగుళ్లు తేలింది.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి..

లెండుగురే శ్యాంరావు, బీఆర్ఎస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి



కాగజ్‌నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ భవనంలో సమస్యలు నెలకొన్నాయి. వీటిని ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలి. ఇప్పటికే డంపుయార్డుతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. డంపుయార్డుతో విద్యార్థులకు ఎక్కడ లేని వాసన వస్తోంది. రోడ్డు సౌకర్యం కూడా లేదు. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురద అవుతోంది. అధికారులు వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి.

మీడియా ప్రతినిధులు నామినేషన్లు సమర్పించాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడంలో మీడియా నిర్వహించిన పాత్రపై అవార్డులు అందజేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడంలో ముఖ్య పాత్ర పోషించిన ప్రింట్, ఎలక్ట్రానిక్, రేడియో, ఆన్‌లైన్, సోషల్ మీడియా ప్రతినిధులకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అవార్డులు అందిస్తామన్నారు. జిల్లా పరిధిలోని సంస్థలు, ప్రతినిధులు వారు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, శిబిరాల పూర్తి వివరాలతో నామినేషన్‌లు సమర్పించాలని తెలిపారు. ఈ నెల 25న రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపిస్తామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జైపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుందారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శివ్వారంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ రాకేష్ కుమార్ పొదుపు, రుణాలు, బీమా పథకాలు, డిజిటల్ చెల్లింపులు, సైబర్ మోసాలపై జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కళాజాత బృందం సభ్యులు పాటలు, మాటలు, మ్యాజిక్ షో ద్వారా బ్యాంకు పథకాలు, సేవల గురించి తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రసవం: తల్లీ బిడ్డ క్షేమం



బెజ్జూరు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాలింత అనూష, పసికందు

బెజ్జూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులు అధికం కావడంతో ఓ గర్భిణీకి రోడ్డుపైనే ప్రసవం జరిగిన సంఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన గుర్లె అనూషకు ఉదయం పురిటి నొప్పులు అధికం అయ్యాయి. ఆమె అత్త లక్ష్మి ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్తున్న క్రమంలో ఇంటినుంచి కొద్దిదూరం వెళ్లేసరికి పురిటినొప్పులు అధికమైన ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇరుగుపొరుగు వారు గమనించి చీరలను అడ్డుగా పెట్టి ప్రసవం జరిపించారు. అనంతరం ఆశాకార్యకర్త శ్రీరామ వైశాలీ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రా నికి తరలించగా శిశువు బరువు తక్కువగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు జిల్లాకేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

అంబులెన్స్‌లో ప్రసవం



పుట్టిన చిన్నారితో 108సిబ్బంది, కుటుంబ సభ్యులు

రెబ్బెన, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం చోపిడీ గ్రామానికి చెందిన గిరిజనమహిళ ఆత్రంభీంబాయి గురువారం 108లో ప్రసవించింది. భీంబాయికి పురిటి నొప్పులు అధికం కావడంతో 108లో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవం జరిగినట్టు ఈఎంటీ పరుశురాం, పైలట్ సంతోష్‌తెలిపారు. భీంబాయి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు, బెల్లంపల్లి ఆసుపత్రిలో చేర్పించినట్టు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

లింగాపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన జాదవ్ శంకర్‌నాయక్ 13రోజుల క్రితం కిడ్నీవ్యాధితో మృతిచెందగా గురువారం అభ్యుదయ ఫౌండే షన్ సభ్యులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరు వేల రూపాయల ఆర్థికసాయం అందించారు కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జాటోత్ దవిత్‌కుమార్, దవనే విశ్వకాంత్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటకు అడవి పందుల బెడద

కెరమెరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అడవిపందుల బెడదతో రైతులు నష్టపోతున్నారు. మండల కేంద్రంతోపాటు గోయగాం, సావర్‌ఖేడ, ధనోర, పార్డి, మురికి లొంక, ఇందాపూర్, నిశాని, ఖైరి గ్రామాల్లో ఎకరాల కొద్ది పత్తి పంటను అడవిపందులు ధ్వంసం చేస్తున్నాయి. వ్యవసాయ, అటవీ, రెవెన్యూ అధికారులు స్పందించి ఉమ్మడిసర్వే చేపట్టి తమకు నష్టపరిహారం అందించాలని ఆయాగ్రామాల రైతులు కోరుతున్నారు.

మండల విద్యాధికారిగా రాథోడ్ సుభాష్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండల విద్యాధికారిగా రాథోడ్ సుభాష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. జడ్పీ బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న సుభాష్‌కు ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయా ఉపా ధ్యాయ సంఘాల నాయకులు, ఎమ్మార్సీ సిబ్బంది ఎంఈవోను ఘనంగా సన్మానించారు.

ప్రారంభమైన ఛట్ పూజలు





ఛట్ పూజల్లో పాల్గొన్న భక్తులు

కాగజ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఛట్ పూజలు ప్రారంభమయ్యాయి. బీహార్, జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ వాసులు అధికంగా ఈ పూజలు చేస్తారు. ఎస్పీఎం నీటి కొలనులో దిగి గురువారం సాయంత్రం నుంచి సూర్యదేవుడికి పూజలు చేశారు. అనంతరం సూర్యదేవుడిని ఆరాధిస్తూ హారతులను పట్టారు. సూర్యాస్తమయం కాగానే తాము తెచ్చుకున్న ప్రసాదాలతో ఇంటికెళ్లారు. ఛట్ పూజల సందర్భంగా బాణసంచాను కాల్చి సంబరాలు జరిపారు.

కఠోర దీక్ష ఛట్ పూజ..

దేశవ్యాప్తంగా పేరొందినది ఛట్ పూజ. ఈ పూజ చేసేవారు ఎంతో కఠిన నియమాలు పాటించాల్సి ఉంటుంది. గురువారం సాయంత్రం నుంచి దేశవ్యాప్తంగా ఛట్ పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజలో ప్రధానంగా సూర్య భాగవానుడికి పూజలు చేస్తారు. ఈ ఛట్ పూజలు ప్రధానంగా ఉత్తర భారతీయులు అధికంగా చేస్తారు. భూమి మీద మనుగడ కల్పించిన సూర్య భాగవానుడికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ పూజలు చేస్తారు. ఈ పూజలు చేస్తే ఆయురారోగ్యాలు, ఆనందాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. పాండవులు, ద్రౌపది ఛట్ పూజలు చేసినట్టు మహాభారతంలో కథనాలున్నాయి. ఈ పూజల్లో పాటించే పద్ధతుల్లో నహయ్ ఖాయ్ అంటే మొదటి రోజు భక్తులు శుద్ధి చేసిన నది లేదా తీరంలో స్నానం చేసి స్వచ్ఛతను పాటిస్తారు. లోహండా, ఖర్నా రెండోరోజు ఉపవాసం. సాయంత్రం చేసిన ప్రసాదం తీసుకుంటారు. సంధ్యా అర్ఘ్య మూడవ రోజు. సూర్యాస్తమయానికి పూజచేసి, నది లేదా సరస్సు ఒడ్డున నెయి, నూనెతో దీపాలు, పండ్లను సమర్పించి సూర్య భగవానుడిని ఆరాధిస్తారు. ఉషా అర్ఘ్య ఈ పూజలో చివరిరోజు అనగా వేకువ జామునే సూర్యదేవుడికి హారతి, పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి పూజను ముగిస్తారు.

కాగజ్‌నగర్‌లో నోరూరించే 'నేతి కిచిడి'

● సామాన్యుడికి అందుబాటు ధరలో లభ్యం ● తినేందుకు ఆసక్తి చూపిస్తున్న ప్రజల



తయారు చేసిన నేతి కిచిడి



కాగజ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో నేతి కిచిడికి భలే స్పెషల్. అంబేద్కర్‌చౌక్ సమీపంలోని ఫైన్ హోటల్‌లో ఉదయం 7నుంచి 10గంటల వరకు ఈ కిచిడి అందుబాటులో ఉంటుంది. ఒక్కో ప్లేటుకు రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ కిచిడి తినేందుకు పట్టణవాసులతో పాటు వివిధ మండలాల ప్రజలు వస్తుంటారు. ఉదయం పదిగంటల వరకు హోటల్ వద్ద రద్దీ ఉంటుంది. ఉదయం పూటనే ఈ కిచిడి తినటంతో సాయంత్రం నాలుగు గంటల వరకు ఆకలి ఉండదని, దీంతో దూరప్రయాణాలు చేసే వారు, చిరు ఉద్యోగులు, కార్మికులు ఈ కిచిడి తినేందుకు అధికంగా వస్తు న్నారు. తాము ఉదయం పూట విధుల్లో చేరితే సాయంత్రం వరకు ఇంటికి వస్తామని ఒక్కపూట తింటే తమకు సాయంత్రం వరకు ఆకలి ఉండదని పలువురు తెలిపారు. కిచిడికి సాంబారు, మిర్చి చట్నీ, టమాట చట్నీ అందిస్తున్నారు. వేడి వేడి కిచిడి తినేందుకు వస్తుండటం, కస్టమర్ల తగ్గట్టు కూడా అందుబాటు ధరలోనే కిచిడి పెట్టేస్తుండటంతో భోజనప్రియులు ఉదయం నుంచి బారులు తీరుతారు.

అందరికీ అందుబాటు ధరలో..

-ముజ్జు, ఫైన్ హోటల్ నిర్వాహకుడు



మా హోటల్‌లో నేతి కిచిడి స్పెషల్. దీనిని రుచికరంగా తయారుచేస్తాం. ఉదయం ఏడునుంచి పదిగంటల వరకు అమ్ముతాం. అందరికీ అందుబాటులో ధరలో రూ.50కే ప్లేట్ కిచిడీ ఇస్తున్నాం. నేతి చికిడి కావటంతో కనీసం నాలుగు నుంచి ఐదు గంటల పాటు ఆకలి వేయదు. దీంతో ఎక్కువ మంది చికిడిని తినడానికి ఇష్టపడుతున్నారు. నిత్యం 200నుంచి 250ప్లేట్ల వరకు విక్రయిస్తున్నాం.

ప్రమాద స్థలాల పరిశీలన



ప్రమాద స్థలాలను గుర్తిస్తున్న పోలీసులు

హాజీపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారి 63పై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు అధికారులు గురువారం ప్రమాద స్థలాలను పరిశీలించారు. ముల్కలపేట బస్టాండ్, ముల్కల బ్రిడ్జి, వేంపల్లి పంచాయతీ ఎదురుగా రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ గోపతి సురేష్‌లు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్,(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని సీఐ వేణుచందర్ అన్నారు. జాతీయ రహదారి, ఇతర రోడ్లపై ఉన్న బ్లాక్ స్పాట్లను ఆయన పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల్లో 18 - 45 ఏళ్లలోపు వారే చనిపోతున్నారన్నారు. అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు, జీబ్రా క్రాసింగులు, డిజిటల్ బోర్డులు, సర్వీసు రోడ్డు వేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ సంతోష్, జాతీయ రహదారి ఏఈ జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ షోరూంలో చోరీ

మంచిర్యాల అర్బన్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఏషియన్ శ్రీనివాస థియేటర్ వెనుక గల ఎక్సైడ్ బ్యాటరీ షోరూంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు షాపు షెటర్‌ను ధ్వంసం చేసి లోనికి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.3.80 లక్షలను అపహరించుకుపోయారు. షాపు యజమాని తుషార్ అగర్వాల్ గురువారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా షెటర్ ధ్వంసం చేసి ఉండటం, కౌంటర్‌లోని నగదు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడని సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

గంజాయి సాగు కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గంజాయిసాగు చేసిన కేసులో నిందితుడికి పదేళ్ళ కఠిన కారగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్ గురువారం తీర్పు చెప్పారు. జైనూరు సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం సిర్పూర్(యు) మండలం పంగిడి గ్రామానికి చెందిన ఆత్రం అమృతరావు పొలంలో గంజాయిని సాగు చేశాడు. సమాచారం తెలుసుకున్న అప్పటి ఎస్ఐ విష్ణువర్ధన్ అక్టోబరు 12, 2021న పొలంను తనిఖీ చేయగా గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. దీంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పీపీ జగన్మోహన్‌రావు సాక్ష్యులను విచారించగా నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన డీఎస్పీ కరుణాకర్, సీఐ రమేష్, ఎస్ఐ రామకృష్ణ, కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్‌ను ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అభినందించారు.

ఆసుపత్రిని శుభ్రం చేయించిన పోలీసులు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారితో గురువారం ట్రాఫిక్ పోలీసులు మాతా శిశు ఆసుపత్రిని శుభ్రం చేయించారు. 27 మంది తనిఖీల్లో పట్టుబడగా బుధవారం కోర్టులో హాజరుపర్చారు. వారం రోజులపాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాతా శిశు ఆసుపత్రిని శుభ్రం చేయాలంటూ న్యాయమూర్తి కమ్యూనిటీ సర్వీస్ శిక్షను విధించగా ఆ శిక్షఅమలులో భాగంగా ట్రాఫిక్ ఏఎస్సై నందగోపాల్ వారితో ఆసుపత్రిని శుభ్రం చేయించారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక చేయూత

మంచిర్యాల అర్బన్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ పరిధిలో హోంగార్డులుగా విధులు నిర్వహించి అనారోగ్య కారణాల చేత చనిపోయిన వారి కుటుంబసభ్యులకు సీపీ ఎం.శ్రీనివాస్ ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. బి.శ్యామ్‌కుమార్, వెంకటేశం, నగేష్, ఫిరోజ్ ఖాన్ కుటుంబాలకు రాష్ట్ర హోంగార్డు సంక్షేమ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.15వేలచొప్పునమంజూరు కాగా సీపీఅందజేశారు. అడీషనల్ డీసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, హోంగార్డ్స్ ఆర్ఐ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

దండేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదాపూర్ గ్రామానికి చెందిన సల్ల రాకేష్(24) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. రాకేష్ ఎలాంటి పనిచేయకుండా జులాయి తిరుగుతున్నావని తల్లిదండ్రులు ఈనెల2న మందలించారు. సోమవారం తీవ్రమనస్థాపం చెంది పురుగుల మందు తాగివాంతులు చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని మ్యాదరిపేట ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడవైద్యుల సూచనమేరకు కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులసూచన మేరకు మెరుగైన వైద్యచికిత్సకోసం హైదరాబాద్ గాంధీఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి సల్ల భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ వెల్లడించారు.



శ్రీరాంపూర్‌లో వెయ్యి డబుల్ బెడ్‌రూం క్వార్టర్ల నిర్మాణం

శ్రీరాంపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో త్వరలో వెయ్యి డబుల్ బెడ్‌రూం క్వార్టర్లు నిర్మించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా తెలిపారు. యూనియన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో 40ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్లలోనే ఉద్యోగులు నివసిస్తున్నారని తెలిపారు. ఉద్యోగులు ఎక్కువగా ఉండగా, క్వార్టర్లు తక్కువగా ఉన్నాయన్నారు. అంతేకాకుండా ప్రస్తుత క్వార్టర్లలో చాలా శిథిలమయ్యాయని, వానాకాలంలో ఊరుస్తున్నాయన్నారు. దీంతో ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులందరికి సరిపోయే విధంగా క్వార్టర్లు నిర్మించాలని తమ యూనియన్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేసిందన్నారు. స్పందించిన యాజమాన్యం శ్రీరాంపూర్ డివిజన్‌లో వెయ్యి డబుల్ బెడ్‌రూం క్వార్టర్లు నిర్మించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయి: జీఎం



ఏజెంటును సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మానసిక వికాసానికి క్రీడలు దోహదపడ తాయని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. కంపెనీస్థాయి ఫుట్‌బాల్ క్రీడల్లో మొదటిస్థానం పొందిన జట్టును గురువారం ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ కంపెనీస్థాయిలో శ్రీరాంపూర్ జట్టు మొదటిస్థానం పొందడం సంతోషంగా ఉందన్నారు. కోల్ ఇండియా స్థాయిలోనూ రాణించి సంస్థకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీ సైదా, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న ఏజెంటుకు సన్మానం..

ఆర్‌కే7 గ్రూప్ ఏజెంటుగా పనిచేసి, ఆర్‌జీ-2 ఏరియాకు ఎస్‌వోటు జీఎంగా వెళ్తున్న రాముడును శ్రీరాంపూర్ ఏరియాజీఎం ఎల్‌వి సూర్యనారాయణ గురువారం సన్మానించారు. రాముడు 18నెలలలో ఏరియాలో వార్షికలక్ష్యాన్ని సాధించేందుకు కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటుజీఎం శ్రీధర్‌రావు, ఇందారం ఓసీపీ పీవో ఏవీరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఆర్‌కే న్యూటెక్ గని మేనేజర్ స్వామిరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్

రెబ్బెన, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని జీఎం కార్యాలయంలో గురువారం విజిలెన్స్‌పై వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్కృతి దేశ పురోభివృద్ధి అంశంపై శిక్షకులు కిషోర్ బగాదియ మాట్లాడారు. అవినీతికి పాల్పడుతున్న వ్యక్తులతో దేశఅభివృద్ధిపై పడుతున్న ప్రభావాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కె రాజమల్లు, ఏరియా ఇంజనీర్ భీంరావు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఉమాకాంత్, అధికారులు పాల్గొన్నారు.

రామచంద్ర మిషన్‌ను పరిశీలించిన జీఎం శ్రీనివాస్

రెబ్బెన, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని శ్రీరామచంద్ర మిషన్‌కేంద్రాన్ని గురువారం సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ కేంద్రానికి ఎంతమంది అభ్యాసకులు వస్తున్నారు, తదితరాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామచంద్రమిషన్ ఆశ్రమాన్ని అభివృద్ధి చేసేందుకు తమవంతు సహాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నిర్వహకులు పాల్గొన్నారు.

పాపం శునకాలు..

మిగతా 7వ పేజీలో..

ఆస్పత్రిలో వైద్యుడు మినహా సిబ్బంది లేకపోవడంతో శునకాలకు శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. ఈ సమాచా రాన్ని వైద్యుడు సదరు ఏజెన్సీకి తెలియజేయడంతో డాగ్ క్యాచర్లతో సర్దుకుపోవాలని తెలిపాడు. శస్త్ర చికిత్స చేసే ముందు శునకాలకు మత్తు ఇంజక్షన్ (అనస్థీషియా) ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు శిక్షణ పొందిన వెటర్నరీ అసిస్టెంట్లు అందుబాటులో ఉండాలి. వారిని విధుల్లో నుంచి తొలగించడంతో కాంట్రాక్టరు సూచన మేరకు డాగ్‌క్యాచర్లతో అనస్థీషియా చేయించారు. దీంతో ఇం జక్షన్ వికటించి వారం రోజుల క్రితం మూడు శునకాలు మరణించగా, వాటిని బయట పడవేశారు. ఈ విషయం వెలుగులోకి రాలేదు. అప్పటి నుంచి శస్త్ర చికిత్సలు నిలిచిపోగా సిబ్బంది లేక ఆహార పానియాలు కూడా అందడం లేదు.

మరో ఐదు శునకాలు మృత్యువాత...

శునకాలకు ఆహార పానియాలు అందించే వారు లేక ఐదు శునకాలు పస్తులతో మృత్యువాత పడ్డాయి. ఆస్పత్రి ఆవరణంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. మరణించిన శునకాల కళేబరాలు కూడా తొలగించకపోవడంతో ఆస్పత్రి ప్రాంగణమంతా దుర్గంధం వెదజల్లు తోంది. విధుల్లో నుంచి తొలగించిన సిబ్బంది వేతనాల కోసం ఏజెన్సీతో మాట్లాడేందుకు గురువారం ఆస్పత్రికి వెళ్లారు. దుర్వాసన రావడంతో గదుల్లో పరిశీలించగా ఐదు శునకాలు మృతి చెంది ఉండటంతో విషయం వెలుగులోకి వచ్చింది. మరికొన్ని శునకాలు కొన ఊపిరితో ఉన్నాయని తెలిపారు.

శునకాల ప్రాణం తీశారు...: పెంచాల సమ్మయ్య, హెల్పర్



రెండు నెలల వేతనాల కోసం కాంట్రాక్టర్‌కు ఫోన్ చేస్తే బెదిరిస్తున్నాడు. విధుల్లో నుంచి తొలగించినట్లు చెబితే రూపాయి కూడా ఇవ్వనని దురుసుగా మాట్లాడు తున్నాడు. మమ్మల్ని విధుల్లో నుంచి తొలగించి, అకార ణంగా వాటి ప్రాణాలను తీశారు.

కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది..: కుంచపు లక్ష్మి, కుక్



రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుం బ పోషణ ఇబ్బందిగా మారింది. జీతం అడినందుకు పనిలో నుంచి తీసేశారు. సిబ్బంది లేకపోవడంతో శున కాలు చనిపోతున్నాయి. వెంటనే మమ్మల్ని పనిలోకి తీసుకొని జీతాలు ఇవ్వాలి.

పంటలకు సీసీ కెమెరాలు

- చోరీల భయంతో రైతుల జాగ్రత్తలు
- తోటల రక్షణకు రైతుల ప్రయత్నం

బెల్లంపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు పంట పొలాల్లో దర్శనమిస్తున్నాయి. గతంలో ఇండ్లలో, షాపుల్లో ఉంటుండగా ప్రస్తుతం రైతులు వారి వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ బావులు, పొలాల వద్ద బోరు మోటార్లను, డ్రాగన్ ఫ్రూట్, వివిధ ఖరీదైన పండ్లను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. కూరగాయలను సైతం ఎత్తుకెళ్తుండడంతో రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో తోటలకు కాపలా ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు.



జామ తోటలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

వ్యవసాయ క్షేత్రాల్లో సీసీ కెమెరాలు

రైతులు పంట పొలాల వద్ద 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేసి సాగు చేస్తారు. దొంగలు బోరు మోటార్లను, సాగు చేస్తున్న పండ్లు, కూరగాయలను దొంగిలిస్తుండడంతో సీసీ కెమెరాలను అమర్చుకుంటున్నారు. ఈ కెమెరాలకు కొందరు విద్యుత్ సౌకర్యంతో మరికొందరు సోలార్ సిస్టంతో పనిచేసేలా అమర్చుతున్నారు. పొలం సరిహద్దుల్లోకి ఎవరు వస్తున్నారనే విషయాన్ని రైతులు ఫోన్‌లలో చూసే విధంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. సీసీ కెమెరాలకు రూ. 15 వేల నుంచి రూ. 40 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. రాత్రి సమయంలో దొంగల ముఖకదలికలు కనబడేలా నైట్‌విజన్ కెమెరాలను, అధిక సామర్థ్యం ఉన్న కెమెరాలను రైతులు అమర్చుతున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.



డ్రాగన్ ఫ్రూట్ తోట వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

దొంగల బెడద తగ్గింది : దుర్గం రాజం, లంబాడితండా

రెండున్నర ఎకరాల్లో నాలుగేళ్ళుగా డ్రాగన్ ఫ్రూట్, జామ పండ్ల తోటలను సాగు చేస్తున్నాను. ఊరికి దూరంగా ఉండడంతో తోటల్లో దొంగతనాలకు పాల్పడేవారు. కిలోకు రూ. 200 లకు పైగా ఉన్న డ్రాగన్ ఫ్రూట్‌ను ఎత్తుకెళ్లేవారు. వెంటనే 8 నైట్‌విజన్ సీసీ కెమెరాలను తోట వద్ద ఏర్పాటు చేశాను. ఫోన్‌లో ఎప్పటికప్పుడు పంట పొలంలో ఏం జరుగుతుందని చూస్తూ ఉంటాను. కెమెరాల ఏర్పాటుతో దొంగలు దొంగతనాలకు పాల్పడడం లేదు.



బోరు మోటార్లను ఎత్తుకెళ్లారు : సత్తయ్య, రైతు, పులిమడుగు

పొలం వద్ద పంట సాగు కోసం బోరు మోటారు ఏర్పాటు చేసుకున్నాను. దీని విలువ రూ. 50 వేలకు పైగానే ఉంటుంది. దొంగలు రాత్రివేళలో వచ్చి బోరు మోటారును ఎత్తు కెళ్లడంతో నష్టపోయాను. దీంతో రాత్రి సమయంలో సరిగ్గా కన బడే నైట్‌విజన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నాను.



విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

చెన్నూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పొక్కూరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం దత్తకుమార్ పదో తరగతి విద్యార్థులకు రూపొందించిన ప్రణాళిక, వంద శాతం ఫలితాల కోసం తీసుకుంటున్న చర్యల గురించి తెలిపారు. పాఠశాల పని తీరుపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉన్నత చదువులతో మెరుగైన జీవితం

గర్మిళ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులతో మెరుగైన జీవితం కలుగుతుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి అర్పితమారం రెడ్డి అన్నారు. గురువారం గర్మిళ్ల ఉన్నత పాఠశాలలో బాలల చట్టాలు, హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ముందుకు వెళ్లాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాలలోని గదులు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహంలో సంబరాలు

గర్మిళ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడాన్ని హర్షిస్తూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ వసతి గృహంలో సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు తినిపించారు. నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, రేగుంట క్రాంతికుమార్, వార్డెన్ లక్ష్మణ్, నాయకులు అజయ్, విష్ణు, తేజ తదితరులు పాల్గొన్నారు.

డీటీడీవో సస్పెన్షన్ ఎత్తివేయాలి

కాసిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురి కాగా దీనికి డీటీడీవో గంగారాంను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నామని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్ అన్నారు. గురువారం కాసిపేటలో ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూరులో జరిగే స్పోర్ట్స్ మీట్‌లో ఉన్న గంగారాంను ఈ సంఘటనకు బాధ్యుడిని చేయడం బాధాకరమన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని, డీటీడీవో సస్పెన్షన్ రద్దు చేయాలన్నారు. లేకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. నాయకులు ఆడె జంగు, పెంద్రం హన్మంతు, ఆత్రం జంగు, సూరు, సిడాం జంగు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

జైపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జైపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రాకేష్ రెడ్డి, సుగుణాకర్‌రెడ్డిలు క్యాన్సర్‌కి కారణాలు, లక్షణాలు, చికిత్సలపై విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ బాల మోహన్, ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్‌రెడ్డి, సభ్యులు డేగ బాపు,వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, కమలాకర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తిరుపతి, వైస్ చైర్మన్ గాయత్రి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద హైఅలర్ట్

మావోయిస్టుల లేఖతో ఎమ్మెల్యే వినోద్‌కు భద్రత పెంపు

బెల్లంపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను హెచ్చరిస్తూ ఇటీవల భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ లేఖను విడుదల చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బాంబ్ స్క్వాడ్‌కు సంబంధించిన డోర్ ఫ్రేమ్‌ను గురువారం పోలీసులు ఏర్పాటు చేశారు. క్యాంపు కార్యాలయానికి నాయకులు, ప్రజలు ఎవరు వచ్చిన డోర్ ఫ్రేమ్ లోపల నుంచి రమ్మని తనిఖీలు చేసి పంపిస్తున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రెండు ప్రవేశ ద్వారాలు ఉండగా ఒకదాన్ని మూసివేశారు. ఒకటే ప్రవేశ ద్వారం ద్వారా ప్రజలను, నాయకులను తనిఖీలు చేసి లోపలికి పంపిస్తున్నారు. బాంబుస్క్వాడ్‌కు సంబంధించి నలుగురు ప్రత్యేక పోలీసులు ఉంటున్నారు. వీరితో పాటు ఒక ఎస్‌ఐ, కానిస్టేబుల్ సైతం పర్యవేక్షిస్తున్నారు. క్యాంపు కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సైతం పరిశీలన జరుగుతుంది.



క్యాంపు కార్యాలయం వద్ద బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై గడిచిన 9 నెలల వ్యవధిలో రెండు సార్లు మావోయిస్టు లేఖలు విడుదలయ్యాయి. దీంతో పోలీసులు ఎమ్మెల్యే వినోద్‌కు భద్రత పెంచారు. గతంలో ఎమ్మెల్యే 2 ప్లస్2 గన్‌మెన్‌ల భద్రతలో ఉండగా ప్రస్తుతం 3ప్లస్3 గన్‌మెన్‌లతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎమ్మెల్యే పర్యటనకు వెళ్లినప్పుడు ఎమ్మెల్యే కాన్వాయ్‌కు మరో భద్రత వాహనాన్ని పెంచారు. ఎమ్మెల్యే తమకు చెప్పకుండా పర్యటించరాదని పోలీసులు సూచించినట్లు సమాచారం.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలో ఈ నెల 5వ తేదీన జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 ఖోఖో పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారని ప్రిన్సిపాల్ బుచ్చన్న తెలిపారు. పాఠశాలకు చెందిన ఎ.అక్షిత్, బి.మేఘన, ఎం.సాత్విక (ఎంపీసీ, ఫస్ట్‌ఇయర్), కె.ధీరజ్ (సీఈసీ, ఫస్ట్‌ఇయర్), ఎన్.నిశాంత్ (ఎంపీసీ, సెకండ్ ఇయర్)లు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, ఈనెల 8 నుంచి 10వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ సుదీప్, ఉపాధ్యాయుల బృందం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు పణిరాజా, బాబురావులు అభినందించారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

తాండూర్, (ఆంధ్రజ్యోతి): అచ్చలాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు అభిరామ్, రిత్విక్‌లు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి గురువారం తెలిపారు. వీరు ఈ నెల 8 నుంచి 10 వరకు హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, సుధాకర్, భాస్కర్, రవి, అంజిరెడ్డి, శ్రీనివాస్ అభినందించారు.

స్కిల్ యూనివర్సిటీని సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లిరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న స్కిల్ యూనివర్సిటీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య పేర్కొన్నారు. బెల్లంపల్లి బాలుర జూనియర్ కళాశాలను గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వృత్తి విద్య కోర్సులను ఎంచుకున్న విద్యార్థులు కష్టపడి నేర్చుకుని మంచి మార్కులు సాధించాలన్నారు. క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అధ్యాపకులు సోమయ్య, మౌనిక, నరేష్, నవీన్, శ్రావణి పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

వరి కోతల సమయంలో జాగ్రత్తలు పాటించాలి

భీమారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వరికోతల సమయంలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ పేర్కొన్నారు. గురువారం పోతనపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. హార్వెస్టర్ ద్వారా వరి కోసేటప్పుడు 18 ఆర్‌పీఎంలో పెట్టాలని, బ్లోయర్‌ను ఆన్ చేసుకోవాలన్నారు. చెత్తాచెదారం రాకుండా నాణ్యమైన ధాన్యం వస్తుందన్నారు. వరి గింజలు ముదిరిన తర్వాతనే పంటను కోయాలన్నారు. ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

దండేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తాళ్లపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సిరంగి సుదర్శన్ తెలిపారు. తాళ్లపేట ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 14 బాలబాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. తాళ్లపేట పాఠశాలకు చెందిన మతిన్, రక్షిత్, ధనుష్, శ్రావణి, మనస్విలు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. గురువారం పాఠశాలలో వారిని అభినందించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు రోజీ వరకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

నస్పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు ఈ నెల 17న కాగజ్‌నగర్‌లో జరిగే ఐదవ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొంటారని మాస్టర్ రంగ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వివిధ విభాగాల్లో ఎంపికైన 21 మంది క్రీడాకారులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేసింది.

అత్యా పత్య జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జైపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి అత్యా పత్య పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు గురువారం తెలిపారు. విద్యార్థులు రాము, సాయిచందలు ఈ నెల 8 నుంచి 12 వరకు తమిళనాడులో జరిగే 35వ బాలబాలికల అత్యా పత్య నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఎస్‌పీపీ స్రవంతి, జేపీపీ కమలాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు సంతోష్, శ్రీనివాస్‌లు అభినందించారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

జన్నారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందన్‌పల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయికుమార్, హర్షిత్‌లు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజేందర్ తెలిపారు. ఈనెల 6న జరిగిన జోనల్ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 8 నుంచి హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు. గురువారం విద్యార్థులను హెచ్‌ఎం, పీడీ తిరుపతిలు అభినందించారు.



విద్యార్థులతో హెచ్‌ఎం,పీడీ

భద్రత, ఉత్పత్తిలో ఓరియంట్‌కు ప్రథమ అవార్డు

కాసిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సున్నపురాయి గనుల భద్రత వారోత్సవాల్లో భాగంగా హైద్రాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీకి భద్రత, ఉత్పత్తిలో మొదటి బహుమతి లభించిందని కంపెనీ అధికారులు తెలిపారు. మినరల్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా కంపెనీ హెడ్ బాలగిరిధర్ అవార్డు అందుకున్నారు. కంపెనీ డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, సేఫ్టీమేనేజ్‌మెంట్, లోడింగ్ ట్రాన్స్‌పరేషన్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్‌లో మెరుగైన ప్రతిభ కనబర్చినందుకు అవార్డు వచ్చింది. కంపెనీ అధికారులు రాజశేఖర్‌రెడ్డి, సహరే పాల్గొన్నారు.



హైద్రాబాద్‌లో అవార్డు అందుకుంటున్న కంపెనీ హెడ్

ప్రాచీన శైవక్షేత్రం

అంబా అగస్త్యేశ్వరాలయం



చెన్నూరులోని శివాలయం, శిలాశాసనం

- ఆలయంలో 400 సంవత్సరాలుగా వెలుగుతున్న అఖండ జ్యోతి
- కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు
- నాలుగు తరాలుగా జక్కెపల్లి వంశీయులచే పూజలు

చెన్నూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో వందల సంవత్సరాల చరిత్ర ఉన్న అంబా అగస్త్యేశ్వర ఆలయం (శివాలయం) ఉంది. ఈ ఆలయాన్ని 12వ శతాబ్దంలో నిర్మించారు. అగస్త్యేశ్వర మహర్షి తపస్సు చేసి శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అందుకే ఈ ఆలయానికి అంబ అగస్త్యేశ్వర ఆలయం అని పేరు వచ్చింది. మహర్షి తపస్సు చేసిన ప్రాంతంలో ఆలయం పక్కనే పెద్ద తటాకాన్ని తవ్వించారు. దీనికి అగస్త్య గుండం అని పేరు. అగస్త్య గుండంలో కూడా శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు జరిపేవారని చరిత్ర చెబుతోంది. కాశీలో గంగానది ఉత్తరంగా ప్రవహిస్తుందో చెన్నూరు తీరాన గల గోదావరి నది దక్షిణం నుంచి ఉత్తరానికి ప్రవహిస్తుంది. ఆలయానికి తూర్పున గోదావరి ప్రవహిస్తుండడం, దక్షిణ, ఉత్తర దిశల్లో రెండు చిన్న నదులు ఉన్నాయి. ఆలయ గర్భగుడిలో శతాబ్దాల కాలంగా అఖండ జ్యోతి (దీపం) నిరంతరాయంగా వెలుగుతోంది.

చెన్నూరు క్షేత్రం కాశీ క్షేత్రం వంటిదని కాశేశ్వర ఖండంలో పేర్కొన్నారు. 12వ శతాబ్దంలో వెలిసిన ఈ అంబా అగస్త్యేశ్వర్య ఆలయాన్ని క్రీస్తు శకం 1289లో కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు పునరుద్ధరించారు. ఆలయ గోపురాన్ని ప్రాకారాలను నిర్మించారు. అనంతరం క్రీస్తు శకం 1309లో అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాని అయిన మాలిక్ గఫూర్ ఆలయంపై దాడి జరిపి దేవాలయ గోపురాన్ని ధ్వంసం చేశాడు. క్రీస్తుశకం 1919లో బుక్కదేవరాయల కాలంలో శ్రీకృష్ణదేవరాయలు చెన్నూరుకు వచ్చి ధ్వంసం చేసిన ఆలయాన్ని, ప్రాకారాలను పునర్ నిర్మించారని ప్రతీతి. ఆలయ పునర్ నిర్మాణ సమయంలో గణపతి దేవాల య గోడలో దాగి ఉన్న శ్రీకృష్ణదేవరాయల శాసనం బయట పడింది. ఈ శాసనాన్ని ఆలయం ఎదుట ప్రతిష్ఠించారు. తెలుగు, కన్నడ మిశ్రమ భాషతో కూడిన శాసనంలో ఖిల్జీయుల గక్స దరి, నరీలు చేసిన విధ్వంసం గురించి పేర్కొన్నారు. ఆలయ విధ్వంసం అనంతరం ఎవరెవరు దీనిని పునరుద్ధ రించారో వివరంగా చెక్కి ఉంది. దీని కింద మహా మంత్రి తిమ్మరసు సంతకం ఉంది. అనంతరం ఈ దేవాలయంలో రామేశ్వర శివలింగంను ప్రతిష్ఠించారు. ఈ విషయాలను ప్రజలు నేటికి కథలు కథలుగా చెప్పుకుంటారు.

400 సంవత్సరాలుగా వెలుగుతున్న అఖండ జ్యోతి

➡ చెన్నూరు పట్టణంలోని అంబా అగస్త్యేశ్వర ఆలయం (శివాలయం)లో 400 సంవత్సరాలుగా అఖండ జ్యోతి వెలుగుతూనే ఉంది. ఈ అఖండ జ్యోతి (దీపం) నిర్వహణ అక్కెపల్లి వంశీయులు నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్స రం అశ్వయుజ పౌర్ణమి (కోజాగిరి) నుంచి మొదలై కార్తీక పౌర్ణమి వరకు కాగడ హారతిని కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. జక్కెపల్లి సోదరులు భజన కార్యక్రమాలను నిర్వహిస్తారు.



నాలుగు తరాలుగా జక్కెపల్లి వంశీయులే...



శివాలయంలో నాలుగు తరాలుగా పట్టణానికి చెందిన జక్కెపల్లి వంశం వారే పూజలు చేస్తున్నారు. గతంలో అక్కెపల్లి సదాశివ, వెంకటరాజం, కిష్టయ్యలు నిర్వహించగా ఇప్పుడు నాలుగోతరానికి చెందిన హిమాకర్ శర్మ సోదరులు ఈ అఖండ జ్యోతి నిర్వహణ, కార్తీక మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.





పల్లెల్లో 'స్థానిక' సందడి

- సంక్రాంతి లోపు గ్రామాల్లో కొత్త పాలకులు
- మంత్రి పొంగులేటి ప్రకటనతో ప్రజల్లోకి ఆశావహులు
- రిజర్వేషన్లపై ఉత్కంఠ
- బలమైన అభ్యర్థులను బరిలో దింపేందుకు పార్టీల వ్యూహాలు
- జిల్లాలో 3,48,370 మంది ఓటర్లు

చింతలమానేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల అయినా పోటీలో ఉండేలా ఆశావాహులు సన్నద్ధమవుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కసరత్తులో భాగంగా వార్డులు, పంచాయతీల వారీగా ఓటరుజాబితా ఇప్పటికే విడుదల కావడంతో ఒక్కసారిగా పల్లెల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఓటరు జాబితా పట్టుకుని ఆశావాహ నేతలు సామాజికవర్గాల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. రిజర్వేషన్లు ఖరారు అయిన తరువాత అందుకు అనుగుణంగా ఆయాపంచాయతీలు, వార్డులనుంచి అభ్యర్థులను బరిలో దింపేందుకు ప్రధానరాజకీయ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. అదే విధంగా ఏ సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినా సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారయంత్రాంగం సైతం సిద్ధ మవుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

● ప్రజల్లోకి ఆశావాహులు..

త్వరలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే ఆశావాహులు ప్రజల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం ఆశావహులు ప్రజల్లోనే ఉంటూ గ్రామాల్లో చిన్నాచితక శుభ, అశుభ కార్యక్రమాలకు హాజరవుతూ ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా తాము పోటీల్లో ఉంటామనే సంకేతాలు ఇస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజల్లో పేరున్న తాజామాజీలు మళ్లీ ప్రజల మధ్యే ఉంటుండగా మరికొన్ని చోట్ల అధికారపార్టీకి చెందిన నాయకులు ప్రభుత్వం తమదేనని తాము ఉంటేనే పనులు అవుతాయని ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కోగ్రామంలో నలుగురైదుగురు ప్రయత్నాలు చేస్తున్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో అదే పార్టీకి చెందిన సర్పంచ్‌లే 90శాతం నెగ్గారు. ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉండడంతో ఈ సారి తమను ఆదరిస్తారని కాంగ్రెస్‌శ్రేణులు ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. జిల్లాలో ఇటీవల అధికారులు వెలవరించిన ఓటరు తుదిజాబితాల్లో 3,48,370మంది ఓటర్లు ఉన్నట్లు వెలువరించగా గతపంచాయతీ ఎన్నికలతో పోలిస్తే 79,412మంది ఓటర్లు పెరిగారు. పంచాయతీ ఎన్నికలకు ముందు జిల్లాలో 2,68,917మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,36,074మంది పురుషులు, 1,32,810మంది మహిళలు, ఇతరులు 38మంది ఉన్నారు. జిల్లాలో 335గ్రామపంచాయతీలు ఉండడంతో గతంలో 50శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ..

పంచాయతీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలను ప్రభుత్వం సంక్రాంతి పండుగ లోపు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఇటీవల మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. దీంతో పాటు ప్రభుత్వం కులగణన సర్వే చేపడుతోంది. ఈ సర్వే ఆధారంగా బీసీ రిజర్వేషన్లు నిర్ణయించనుంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు చేపట్టనున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో పంచాయతీ రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయి అన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆసిఫాబాద్	14762	14979	0	29741
బెజ్జూరులో	11608	11878	2	23488
చింతలమానేపల్లి	12016	11684	0	23700
దహెగాం	10858	10894	0	21752
జైనూరు	11779	12235	0	24014
కాగజ్‌నగర్	22387	21720	2	44109
కెరమెరి	11984	11665	1	23650
కౌటాల	13597	13298	1	26896
లింగాపూర్	5018	5359	0	10377
పెంచికలపేట	6231	6044	0	12275
రెబ్బెన	14381	13950	0	28331
సిర్పూర్(టి)	10892	10964	1	21857
సిర్పూర్(యూ)	5748	6326	2	12076
తిర్యాణి	8738	9122	4	17864
వాంకిడి	14298	13939	3	28240
మొత్తం	**1,74,297**	**1,74,057**	**16**	**3,48,370**

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దినకర్ అన్నారు. గురువారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణంలోని రాయల్‌గార్డెన్‌లో ఈనెల9నుంచి11వరకు సీపీఎంజిల్లా మూడవ మహాసభలను నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతోపాటు ముఖ్యనాయకులు హాజరుకానున్నారన్నారు. మహాసభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు రాజేందర్, శేఖర్, టీకానంద్, వినోద్, పవన్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని సన్మానించిన జిల్లా నాయకులు



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గురువారం జరిగిన బీజేపీ వర్క్‌షాపులో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అరిగెలనాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ రానున్న స్థానిక ఎన్నికల్లో ఎక్కువ సీట్లుగెలిచేలా, జిల్లాలోపార్టీని మరింతబలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థులు





రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌లోని గిరిజనఆదర్శక్రీడాపాఠశాల చెందిన విద్యార్థులు అమూల్య, ముత్తుబాయి, అనిత, మౌనిక, ఇంద్రజ, అలేఖ్య, అనలక్ష్మి, పల్లవి, వాసవీ ఉన్నతపాఠశాలకు చెందిన చిప్పయోచన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-14 విభాగం రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జంగు, జిల్లా ఆశ్రమపాఠశాలల స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి తెలిపారు. వీరు ఈనెల 8నుంచి 10వరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగేరాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్, జీసీడీవో శకుంతల, కోచ్‌లు అరవింద్, విద్యాసాగర్, తిరుమల్, హెచ్‌డబ్ల్యువో సాయిబాబా తదితరులు అభినందించారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



పెరటి కోళ్ల పంపిణీ చేస్తున్న తహసీల్దార్ భూమేశ్వర్

బెజ్జూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెరటికోళ్ల పెంపకం ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందాలని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఇందిరాక్రాంతిపథం కార్యాలయంలో స్వయం సహాయక సభ్యులకు పెరటికోళ్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో పెరటికోళ్లకు మంచిడిమాండ్‌ఉండడంతో వాటిపెంపకం ద్వారాఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈఅవకాశాన్ని స్వయంసహాయక సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాసమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, ఎంపీడీవో గౌరీశంకర్, బ్యాంకు మేనేజర్ సత్యకిరణ్, ఏపీఎం మోహన్‌లాల్, డీపీఎం సారయ్య, సీసీలు భద్రయ్య, పద్మ, తిరుపతి ఉన్నారు.

26లోపు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆసిఫాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు వచ్చే సంవత్సరం మార్చిలో జరిగే ఇంటర్ మీడియట్ పరీక్షల కోసం ఈనెల 26లోపు ఆయా కళాశాలల్లో పరీక్షఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి, ద్వితీయసంవత్సరం జనరల్‌విద్యార్థులు రూ.520, ఒకేషనల్ విద్యార్థులు రూ.750 చెల్లించాలని రూ.100 అపరాధరుసుంతో డిసెంబరు 4వరకు, రూ.500 అపరాద రుసుంతో డిసెంబరు 11వరకు,రూ.వేయిఅపరాద రుసుంతో డిసెంబరు 18వరకు, రూ.2వేలు అపరాదరుసుంతో డిసెంబరు27లోపు ఫీజుచెల్లించ వచ్చన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

వాంకిడి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని డీఆర్డీవో దత్తారాం అన్నారు. గురువారం వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఓటరు నమోదు(ఎస్వీఈఈపీ)లో భాగంగా అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవ త్సరాలు నిండిన విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఎస్బీఎం ఎంఐఎస్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, ఏపీవో శ్రావణ్‌కుమార్, ఈసీ మోసిన్, టీఏలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దహెగాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో రెండు అసిస్టెంట్‌కుక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. 7వతరగతి ఉత్తీర్ణత సాధించిన మహిళలు ఈనెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

ఆసిఫాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజంపేటకాలనీకి చెందిన జంజిరాల రాజశేఖర్(22) ఇంట్లో ఉరివేసుకొని గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజశేఖర్ ప్రయివేటుగా పనిచేస్తుండేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రోజులాగే ఇంటికివచ్చిన రాజశేఖర్ గదిలోకివెళ్లి పైపుకు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు తలుపులు పగులగొట్టిచూడగా అప్పటికేమృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులిచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టైగర్‌జోన్‌పై ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టైగర్‌జోన్ ఏర్పాటుపై ఆదివాసీలు ఐక్య పోరాటాలకు సిద్ధంకావాలని రాజ్‌గోండ్ సేవాసమితి జిల్లాఅధ్యక్షుడు మడావి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని రాయిసెంటర్‌లో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లలోని ఆదివాసీసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టైగర్‌జోన్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కుతీసుకునే వరకు సంఘటితంగా ఉండాలన్నారు. ఈ సంద ర్భంగా పలు అంశాలపై తీర్మానించారు. సమావేశంలో రాజ్‌గోండ్ సేవాసమితి రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు భీంరావు, ఆదివాసీ సంఘాల నాయకులు సిడాం అర్జు, చందన్, జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ఆసిఫాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీవోలోకేశ్వర్ అన్నారు. ఆసిఫాబాద్ (005)- ఎస్టీనియోజకవర్గంలో రాష్ట్రఎన్నికల సంఘం, జిల్లాఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈనెల9,10తేదీల్లో ఓటరు సౌకర్యకేంద్రాలను నిర్వహిస్తామని అన్నారు. బీఎల్‌వోలు వారికి కేటాయించిన పోలింగ్‌కేంద్రాల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదుకు ఫాం-6, సవరణ కోసం ఫారం-8, అభ్యంతరాలకు ఫారం-7 పొందుపర్చాలన్నారు. నవంబరు 28లోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

పెంచికలపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ఎంఈవో రమేష్‌బాబు అన్నారు. గురువారం చెడ్వాయి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు-2024కు సంబంధించిన పాఠశాలలస్థాయి ప్రశ్నాపత్రాలను జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు రాజకమలాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తిని కలిగిఉండాలన్నారు. శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలనాసక్తిని పెంపొందించుకోవాలన్నారు. భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాకేష్, సంతోష్‌కుమార్, తాజ్‌పాషా, శిల్ప, సుమిత్ర, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ గ్రంథాలయం ప్రారంభం

దహెగాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచవెల్లి ప్రాథమిక పాఠశాలలో రూంటు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంఈవో శ్రీనివాస్ మోడల్ గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పుస్తకపఠనంతో విద్యార్థులకు ఆలోచన, ఊహాశక్తి, కొత్తపదాలు తెలుస్తాయన్నారు. తెలుగు, ఆంగ్లం 800పుస్తకాలు, రీడింగ్‌టేబుల్, బీరువా, కార్పెట్స్ చిత్రాలు గీయడానికి సామగ్రిని అందజేశారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్



కాగజ్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్‌నగర్‌లో కొనసాగుతున్న సర్వేను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబసర్వే కార్యక్రమంలో కుటుంబసభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రత్యేకఅధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సర్వేప్రక్రియలో భాగంగా కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌ల ప్రకారం ఇళ్లను సందర్శించి కుటుంబ వివరాలను నిర్ణీతనమునాలో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. సర్వేచేసిన ప్రతిఇంటికి మార్క్ చేయాలని తెలిపారు. సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తారో సంబంధిత కుటుంబసభ్యులకు సమచారం అందించాలని, ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువు తేదీలోగా సర్వే పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను స్పష్టంగా నమోదుచేయాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. గురువారం పట్టణంలో చేపడుతున్న సర్వే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సర్వేలో కుటుంబసభ్యుల వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కేటాయించిన ఎన్యూమరేషన్ బ్లాక్‌ల ప్రకారం ఇళ్లను సందర్శించి కుటుంబ సభ్యులు వివరాలను నిర్ణీత నమునాలో స్పష్టంగా నమోదుచేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: తుడుం దెబ్బ



రాస్తారోకో చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

వాంకిడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాంకిడి గిరిజన ఆశ్రమపాఠశాలలో విద్యార్థినుల అనారోగ్యానికి కారకులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తుడుం దెబ్బ నాయకులు మండలకేంద్రంలో అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్య దర్శి కోట్నాక విజయ్ మాట్లాడుతూ వారంరోజుల నుంచి విద్యార్థినులు అస్వస్థతకు గురవుతున్నా ఉన్నతాధికారులు ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకర మన్నారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ విద్యార్థినులకు ఏదైనాజరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆశ్రమపాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకుగురైతే ఇంటి నుంచి తీసుకువచ్చిన ఆహారపదార్థాల వల్ల అస్వస్థతకు గురైనట్లు అధికారులు, సిబ్బంది పేర్కొనడం ఏమిటని ప్రశ్నించారు. బాధ్యులపైచర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళనచేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, రాంషా, రాజు, భీంరావు పాల్గొన్నారు

యుడైస్‌పై అవగాహన

కౌటాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నత పాఠశాలలో గురువారం యుడైస్‌పై ఎంఈవో హనుమంతు, అవగాహన కల్పించారు. జిల్లా సెక్టోరల్ అధికారి అబిద్‌అలీతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వివరాలను పోర్టల్‌లో ఎలాం పొందుపర్చాలి, ఏమైనా పొరపాటు జరిగితే సవరణలు ఎలా చేయాలన్న దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తసార్సాలలో గ్రామసభ

కాగజ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం కొత్తసార్సాలలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో బుచ్చన్న మాట్లాడుతూ 2025-26సంవత్సరానికి ఉపాధిహామీ పనుల వివరాలను పొందుపర్చాలన్నారు. అనంతరం చేపట్టే పలు పనులపై చర్చించారు. సమావేశంలో టెక్నికల్‌అసిస్టెంట్ కిషోర్, పంచాయతీ సెక్రెటరి మహేష్ వైకుంఠం, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

సిర్పూర్(టి), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్రకుటుంబ సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి యజమానుల పేర్లను అడిగి ఇంటికి స్టిక్కర్‌ను అంటిస్తున్నారు. సర్వేను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ

సిర్పూర్(టి), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్యసంఘం కమిటీని గురువారం మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయంలో జిల్లాఅధ్యక్షుడు రాచకొండ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట నాగభూషణం, ప్రధానకార్యదర్శిగా బోనగిరి చంద్రశేఖర్, కోశాధికారిగా తంగడిపల్లి సంతోష్, యూత్ అధ్యక్షుడిగా మహేష్, కోశాధికారిగా విజయ్, ప్రధాన కార్యదర్శిగా స్వప్నిల్‌ను ఎన్నుకున్నారు.

మొబైల్, ఇంటర్నెట్ సేవలు విస్తరించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవలు విస్తరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్‌తివారితో కలిసి బీఎస్ఎన్ఎల్, టీఫైబర్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, జిల్లా గ్రామీణఅభివృద్ధి, సివిల్‌సప్లైఅధికారులతో మొబైల్‌ఇంటర్నెట్ సేవల విస్తరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్నెట్ సేవలు లేకపోవడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేదలకు రేషన్ బియ్యం పంపిణీతో పాటు పెన్షన్‌పంపిణీ లాంటి పథకాలు ఆలస్యమవుతున్నాయని అన్నారు. దీని నివారణకోసం జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు మొబైల్, ఇంటర్నెట్ సౌకర్యాలు విస్తరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. టవర్‌లఏర్పాటు కోసం అటవీ శాఖ అనుమతితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ తీర్మాణాలు, ఆర్వోఎఫ్ఆర్ అనుమతులపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని తిర్యాణి, బెజ్జూరు, దహెగాం, లింగాపూర్ మండలాల్లో కొన్నిటవర్ల నిర్మాణం పూరైందని వాటికి వెంటనే కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు.

పాఠకులకు పూర్తిసౌకర్యాలు కల్పించాలి..

జిల్లా గ్రంథాలయంలో పాఠకులకు పూర్తిసౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని అదనపుకలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకేంద్ర గ్రంథాలయలో పాఠకులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. భవనానికి విద్యుత్, శానిటేషన్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గ్రంథా లయం పరిధిలోని అన్నికెమెరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి తెలిపారు. గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని, ఆర్వో ప్లాంట్ ద్వారా పాఠకులకు శుద్ధ జలాన్ని అందించాలని తెలిపారు. ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గ్రంథాలయంలో పాఠకులకు, పోటీపరీక్షలకు సంబంధించిన అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉంచాల న్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాద నలు సమర్పించాలన్నారు. ఆయనవెంట గ్రంథాలయాధికారి సదానందం, టీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్లు

కాగజ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌పైవిద్యార్థులకు చక్కగా అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో అద్భుతాలు సృష్టిస్తారని జిల్లా ఫైనాన్స్ ఎకౌంట్స్ అధికారి జాడి దేవాజీ తెలిపారు. భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ వారి సౌజన్యంతో గురువారం కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో కాగజ్‌నగర్ డివిజన్‌కు సంబంధించిన ఉపాధ్యాయులకు శిక్షణకార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సైన్స్‌అధికారి మధుకర్ మాట్లాడుతూ మొబైల్‌సైన్స్ లాబరేటరీలో సైన్స్‌కు సంబంధించి మూలాల తెలుసుకోవచ్చన్నారు. ఈ విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌లు మామిడాల తిరుపతయ్య, లక్ష్మిప్రసన్న వివిధ ప్రయోగాలపై వివరించారు. సమావేశంలో ఆయా పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.